


గ్రామీణులకు శుభవార్త

- కొత్త పంచాయతీలకు శ్రీకారం
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు
- జిల్లాలో నాలుగు పంచాయతీలకు అవకాశం
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక : డీపీవో

ఏళ్ల తరబడి తిష్ట వేసిన సమస్యలకు చెక్ పెట్టి గ్రామీణ ప్రజల కల సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామ పంచాయతీల విభజనతో పాటు కొత్త పంచాయతీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు, 28 మండలాలు కలవు. 489 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 11 మేజర్ పంచాయతీలు(గ్రేడ్-1) కలవు. ఈ నెల 20వ తేదీ లోపు ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి నివేదికలు సిద్ధం చేసి పంపాలని డీపీవో లలితాబాయి ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలను ఆదేశించారు.

నంద్యాల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు కూటమి ప్రభుత్వం శుభవార్తను అందించింది. జిల్లాలో కొత్త పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. ఏది ఏమైనా నూతన విధానంతో దూరంగా ఉన్న గ్రామాలను సమీపంలోని పంచాయతీల్లో కలపడం అవసరమైన ప్రాంతాల్లో కొత్త పంచాయతీల ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందే అవకాశముంది.



జిల్లాలో పరిస్థితి ఇలా..

- జిల్లాలో నియోజకవర్గాలు : 07
- మండలాలు : 28
- జిల్లాలోని పంచాయతీలు : 489
- ఇందులో మేజర్ పంచాయతీలు : 11

ఈనెల 20వ తేదీ లోపు..

ప్రభుత్వ ఆదేశాలు మేరకు.. కొత్త పంచాయతీల ఏర్పాటు.. విలీనం తదితర అంశాల పరంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజల నుంచి వినతులను పరిశీలించి ఈనెల 20వ తేదీ లోపు ప్రతి పాదనలు పంపాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) లలితాబాయి జిల్లాలోని ఎంపీడీవోలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు ఆదేశించారు. ఆతర్వాత జిల్లా ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి సమగ్ర నివేదికలను ప్రభుత్వానికి త్వరలోనే అందజే యనున్నారు.

కొత్తగా ప్రతిపాదించే పంచాయతీకి..

జిల్లాలో నంద్యాల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, శ్రీశైలం, డోన్, పాణ్యం, నందికొట్కూ రు నియోజకవర్గాలు ఉన్నాయి. ఎక్కడైనా పంచాయతీ ఏర్పాటు చేయాలంటే.. జనాభా, ఆదాయ వనరులు, ప్రస్తుతం ఉండే పంచాయతీకి.. కొత్తగా ప్రతిపాదించే పంచాయతీకి మధ్య దూరం.. రెవెన్యూ సర్వే నెంబర్లు విభజన తదితర అంశాలకు పరిగణనలోకి తీసుకుంటారు. నిబంధనలు తప్పక పాటించాల్సి ఉంది. ఒక పంచాయతీని రెండు పంచాయతీలుగా మార్పు చేయడం.. రెండు పంచాయతీలను ఒకే పంచాయతీగా మార్చడం. ఒక పంచాయతీలోని గ్రామాన్ని మరో పంచాయతీలోకి కలిపే అవకాశముంది. గ్రామాల విలీనం విషయంలో పకడ్బందీగా పాలక వర్గం తీర్మానం తప్పకుండా ఉండాలి. మార్పులు.. చేర్పులు అంశాలపై ఆయా మం డల పరిధిలో చేయాల్సి ఉంది. మండలాల శివారు గ్రామాలు లేదా పంచాయతీలను ప్రస్తుత ఉన్న మండలాల్లో కాకుండా.. ఇతర మండలాల్లో కలపడం.. లేక విభజించడం వంటి అవకాశం ఉండదు.

కొత్తగా నాలుగు పంచాయతీలు..

ప్రభుత్వ తాజా ఆదేశాలతో త్వరలో జిల్లాలో నాలుగు కొత్త పంచాయతీలు ఏర్పాట య్యే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూ రు, పాణ్యం నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున కొత్త పంచాయతీలు ఏర్పడే అవకాశం ఉందని తెలిసింది. ఏది ఏమైనా తాజా మార్గదర్శకాలతో త్వరలో కొత్త పంచాయతీలు రానున్నట్లైంది.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాలు మేరకు జిల్లాలో కొత్త పంచాయతీలు ఏర్పాటు అంశాలపై అధి కారులకు ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలు పక్కాగా పాటించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ప్రతిపాదనలు రాగానే.. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందిస్తాం.

● లలితాబాయి, డీపీవో, నంద్యాల

సమాజ సంరక్షకులు రైతులే

వైసీపీ నేతలు అలగనూరు కరకట్ట మట్టిని అమ్ముకున్నారు : మంత్రి ఫరూక్



రైతులకు మినుములు అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమాజానికి నిజమైన సంరక్షకులు రైతులేనని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పులిమద్ది గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్న మీ కోసం ముగింపు కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ఉచితంగా మినుము విత్తనాలను, 50 శాతం రాయితీతో నానో యూరియా, డీఏపీని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగుకు సాంకేతిక విజ్ఞానం తోడైతే రైతులకు తిరుగే ఉండదన్నారు. నీటి సామర్థ్యాన్ని పెంచి రైతు ఉత్పాదకతను పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పంటల ఆరోగ్య స్థితిని అంచనా వేస్తూ నీటి లభ్యత, ఆదాయం లభించే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అన్నదాత సఖీభవ ద్వారా రైతుల ఖాతాలో మూడో విడత మార్చి నెలలో జమ చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఎన్టీఆర్ స్థాపించిన ప్రాజెక్టుల ద్వారా రైతులు రెండు పంటలు సాగు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నేడు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కుప్పం వరకు సాగునీరు అందిస్తున్న ఘనత చంద్రబాబుదే అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాణి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, సర్పంచ్ రఘురామిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

కలెక్టర్ రాజకుమారి



వీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నదని కలెక్టర్ రాజాకుమారి పేర్కొన్నారు. బుధవారం రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా నంద్యాల మండలం పెద్ద కొట్టాలలో మీ కోసం రైతన్న వర్క్‌షాప్ కార్యక్రమాన్ని గ్రామరైతు సేవా కేంద్రంలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన సేవలు రైతు సేవా కేంద్రాల ద్వారా సమయానికి సేవలు అందించాలని కోరారు.యూరియా సరాఫరాకు తక్షణమే ఆదేశాలిచ్చారు. పీఏసీ చైర్మన్ ప్రేమ్‌నాథరెడ్డి, సర్పంచి వెంకటరమణ, ఎంపీటీసీ నాగేశ్వరావు, వీరకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వార్షిక ఆదాయ లక్ష్యాలను అధిగమించండి

నంద్యాల నూనెపల్లె, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన వనరులైన ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, రవాణా విభాగాలకు కేటాయించిన వార్షిక లక్ష్యాలను వంద శాతం అధిగమించాలని కలెక్టర్ రాజకుమారి శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఆదాయ వనరుల పెంపుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ అంశాలపై తరచూ సమీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలన్నారు. ఎక్సైజ్ శాఖలో గత ఏప్రిల్ నుంచి నవంబరు వరకు నిర్ణయించిన రూ. 596.63 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి రూ.640.86 కోట్లు సాధించడమే కాకుండా 7.14 శాతం వృద్ధి రేటు నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన నెలల్లో కూడా ఈ వేగాన్ని కొనసాగించి ఆదాయం మరింత పెంచాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు సూచించారు. మైనింగ్ శాఖ పనినీరును పరిశీలించిన కలెక్టర్ వార్షిక లక్ష్యం రూ.530 కోట్లు కాగా నవంబరు వరకు కేవలం రూ.143 కోట్లు మాత్రమే సాధించారని, ఆ శాఖలో ఉన్న లోపాలను తక్షణం సరిదిద్దాలన్నారు. ఆదాయం సృష్టించే వనరులపై అధికారులు నిరంతర పర్యవేక్షణ సాగించాలని, లక్ష్యాల సాధనలో రాజీలేకుండా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ కార్తీక్, డీఆర్వో రామునాయక్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుఫాను గండం..

రైతులు కుదేలు

- ముమ్మరంగా సాగుతున్న వరి కోతలు
- ఆరబెట్టకుండానే అమ్మేస్తున్న రైతులు



శిరివెళ్లలో ధాన్యాన్ని తరలించుకుంటున్న రైతులు

శిరివెళ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను గండంతో రైతన్న కుదేలవుతున్నాడు. అన్నదాతకు తీరని నష్టాన్ని తెచ్చిపెట్టింది. ఈఏడాది పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. వరి సాగు చేసిన రైతులకు అరకొర దిగుబడులే వస్తున్నాయి. దీంతో ఆవేదన చెందుతున్న రైతులను తుఫాను కలవరపెడుతోంది. దిత్వా తుపాను ధాటికి రెండు రోజులుగా ఆకాశం మబ్బుపట్టి తేలికపాటి వర్షం కురుస్తుండడంతో రైతులు తమ దిగుబడులను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. వరి పైరు నేలకొరిగితే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. దీంతో యంత్రాల ద్వారా కోతలను ముమ్మరం చేశారు. కోసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టకుండానే రైతులు దళారులకు విక్రయించుకుంటున్నారు. ఈఏడాది విస్తారంగా కురిసిన వర్షాలు, తుఫానులతో వ్యవసాయం గిట్టుబాటుగాక అప్పులపాలయ్యామని రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

రెండు చిరుతలు హతం..?

- రెండేళ్ల కిందటి ఘటన వెలుగులోకి
- కరెంట్ షాక్ ఇచ్చి హతమార్చినట్లు దర్యాప్తులో వెల్లడి
- అటవీశాఖలో కింది ఉద్యోగి కీలక పాత్రధారి
- అటవీశాఖ అదుపులో పులిగోర్లు కొనుగోలు చేసిన వ్యక్తులు
- ఫారెస్ట్, పోలీసుశాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా విచారణ

నంద్యాల ఎడ్యుకేషన్/ మహానంది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లమలలో రెండేళ్ల క్రితం రెండు చిరుతల హతమైన ఘటన వివరాలు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఫారెస్ట్, పోలీసు అధికారులు నివ్వెరపోయారు. ఈ ఘటన నంద్యాల పట్టణంలో బయటపడడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. పట్టణంలోని సంజీవనగర్‌లో ఓ ఇంట్లో ఒక వ్యక్తి మెడలో పులిగోరును చూసి ఆ గోరు ఎక్కడిదని అటవీశాఖ అధికారులు ప్రశ్నించారు. దీనికి ఆయన తటపటాయించడంతో అనుమానం బలపడింది. వెంటనే ఆ వ్యక్తి ఇంటిలో తనిఖీ చేయగా పులిచర్మం, షూటర్‌గన్ కూడా దొరికినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై పోలీసులు, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఇందులో ఆ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో ఆశ్చర్యపోయేలా చేసింది. దీంతో అప్రమత్తమైన అటవీ, పోలీసుశాఖ అధికారులు మరింత కూపీ లాగారు. ప్రధాన వేటగాడిని కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. ప్రేమ బీట్(కృష్ణనంది ప్రాంతం)లో రెండేళ్ల క్రితం ఒక ప్రొటెక్షన్ వాచర్ సహాయంతో అడవిలో విద్యుత్ తీగలను అమర్చి రెండు చిరుతలను హతమార్చినట్లు విచారణలో బయటపడింది. వెంటనే సదరు ప్రొటెక్షన్ వాచర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఆ పులులకు సంబంధించిన గోర్లు మహానంది మండలం గోపవరం గ్రామంలో ముగ్గురికి, బండిఆత్మకూరు మండలంలో ఇద్దరికి, నంద్యాల పట్టణంలో మరికొందరికి విక్రయించినట్లు తెలిసింది. దీనిపై అధికారులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. చిరుతల హతం వెనుక ఎంతమంది ఉన్నారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది.

జీడీపీకి రూ.92 కోట్లు



గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచడానికి చేపట్టిన పనులు రెండేళ్లకు పైగా ఎక్కడికక్కడ ఆగిపోయాయి. 4.50 టీఎంసీల నుంచి 5.50 టీఎంసీలు నిల్వ సామర్థ్యం పెంచడానికి వీలుగా మట్టి ఆనకట్ట ఒక మీటరు ఎత్తు పెంచడానికి గత వైసీపీ హయాంలో పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టరుకు రూ.27 కోట్లకు పైగా బిల్లులు బకాయి పెట్టారు. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. అయితే.. వరదల వల్ల ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉండడంతో కాంట్రాక్టరుపై ఒత్తిడి తెచ్చి రెండు గేట్లు ఏర్పాటు చేయించారు. అయితే ముంపునకు గురయ్యే భూములకు నష్టపరిహారం ఎంత ఇచ్చేదీ ఈ రోజుకూ తేల్చి చెప్పలేదు. రాబోయే జూలై ఆఖరులోగా పనులు పూర్తి చేయాలంటే రూ.92 కోట్లు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- అసంపూర్తి పనులకు అధికారుల ప్రతిపాదన
- 5.50 టీఎంసీలు నిల్వ చేసేందుకు వీలుగా..
- వైసీపీ హయాంలో మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే పనులకు శ్రీకారం
- బిల్లులు ఇవ్వలేదని చేతులెత్తేసిన కాంట్రాక్టరు
- రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే

కర్నూలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన తరువాత కర్నూలు జిల్లాలో మిగిలిన ఏకైక సాగునీటి ప్రాజెక్టు గాజులదిన్నె జలాశయం. దీని సామర్థ్యం కేవలం 4.50 టీఎంసీలు. కుడి, ఎడమ కాలువల ద్వారా గోనెగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ మం డలాల పరిధిలోని 21 గ్రామాలకు 25,454 ఎకరాలు రబీ ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. డోన్, కృష్ణగిరి, బండగట్టు తాగునీటి పథకాలు ద్వారా డోన్ పట్టణం సహా వివిధ గ్రా మాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణానికి కూడా నీటి సరఫరా కోసం పైపులైన్ పనులు చేపట్టారు. వేసవిలో కర్నూలు నగరం దాహం తీర్చే జీవనాడి. కరువు నేలకు సాగునీరు అందించి రైతుల కన్నీళ్లు తుడవాల్సిన ఈ ప్రాజెక్టు వివిధ పట్టణాలు, గ్రామాలకు తాగునీరు అందించే ఎస్ఎస్ ట్యాంక్‌గా మార్చారని రైతులు ఆరోపిస్తున్నారు. సాగు, తాగునీటి అవసరాలు దృష్ట్యా గత వైసీపీ ప్రభుత్వం సామర్థ్యం 4.50 టీఎంసీలు నుంచి 5.50 టీఎంసీలకు పెంచుతూ రూ.135 కోట్లతో (భూ సేకరణతో కలిపి) ఆనకట్ట ఎత్తు పెంచి, కొత్త గేట్లు ఏర్పాటు చేసే పనులు చేపట్టింది. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నిధులు ఇవ్వకపోవడం వల్ల రెం డేళ్లుగా సామర్థ్యం పెంపు పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

మిగతా 7లో....



జీడీపీ జలాశయం

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య
- కృష్ణానదిలో 62.50 లక్షల చేప పిల్లలు



నెహ్రూనగర్ సమీపంలో కృష్ణనదిలో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే, అధికారులు

పగిడ్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు కలిగిన మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. జిల్లా మత్స్యశాఖ జేడీ హీరానాయక్ ఆధ్వర్యంలో మండలంలోని నెహ్రూనగర్ సమీపంలోని కృష్ణానదిలో బుధవారం 62.50లక్షల చేప పిల్లలు వదిలారు. గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం దన్నారు. మత్స్యకారులకు బ్యాంక్ రుణాలు, సబ్సిడీ కింద వలలను, ఇతర సామగ్రిని అందిస్తుందన్నారు. కొంతమంది దళారులు వైజాగ్, మచిలీపట్నం నుంచి మత్స్యకారులను తీసుకొచ్చి అలివి వలలతో వేట కొనసాగిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి, మత్స్య శాఖ డీడీ రంగనాద్ బాబు, ఏడీ సంధ్యారాణి, ఎఫ్‌డీవో భరత్ నాయక్, ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు తదితరులున్నారు.

నేడు డీఎల్‌డీవో కార్యాలయం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన డీఎల్‌డీవో కార్యాలయం

ఆత్మకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) కార్యాలయాన్ని గురువారం ప్రారంభించనున్నారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లను ఏర్పాటయ్యాక ఆత్మకూరుకు డివిజన్ స్థాయిలో అభివృద్ధి అధికారిణిని ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం అన్వరాబేగం డీఎల్‌డీవోగా పని చేస్తున్నారు. డీఎల్‌డీవో కార్యాలయానికి సరైన భవనం లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని ఓగదిని ఉపయోగిస్తున్నారు. ఆత్మకూరు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాపనంతాపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని డీఎల్‌డీవో కార్యాలయాన్ని వినియోగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. గురువారం ఉదయం 11గంటలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈకార్యాల యాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తుండగా ప్రత్యక్షంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పాల్గొని రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించనున్నారు. బుధవారం ఎంపీడీవో నాగేంద్రుడు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే బుడ్డాను కలిసి ఆహ్వానిం చారు. కార్యాలయ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు.

జ్యోతిర్ముడి శివస్వాములకు మాత్రమే స్పర్శ దర్శనం

● రెండు గంటలకు ఒకసారి ప్రత్యేక స్లాటు



మాట్లాడుతున్న శ్రీశైల దేవస్థానం చైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్ముడి కలిగి ఉన్న శివస్వాములకు మాత్రమే శుక్రవారం వరకు ప్రతి రోజు రెండు గంటలకు ఒకసారి ఉచిత స్పర్శ దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన చైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్తీక మాసాంతం మండల దీక్షలు పూర్తి చేసుకుని మాల విరమణ చేసేందుకు శివస్వాములు వేలాదిగా శ్రీశైలానికి తరలి వస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో ముందుగానే గర్భాలయ, సామూహిక అభిషేకాలు నమోదు చేసుకున్న సేవాకర్తలకు మాత్రం నిర్ణీత టైం స్లాట్ ప్రకారం దర్శనాలు కల్పించనున్నామని అన్నారు. వీవీఐపీ సిఫార్సు లేఖలు, ఆన్‌లైన్ వీఐపీ బ్రేక్ దర్శనాలు ఈనెల 8వ తేదీ వరకు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అధిక సంఖ్యలో వస్తున్న యాత్రికులందరికీ దర్శనభాగ్యం కల్పించాల్సినందున అలంకార దర్శనం మాత్రమే అందుబాటులో ఉంచారన్నారు.

జీడీపీకి రూ.92 కోట్లు ..!


నెర్రెలు ఇచ్చిన గట్టు

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. రైతులకు శాపం..

గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనుల్లో భాగంగా.. ప్రస్తుతం ఉన్న మట్టి ఆనకట్టకు సమాంతరంగా భూ మట్టం (గ్రౌండ్ లెవల్)లో 8-18 మీటర్లు, టాప్ లెవల్ 6 మీటర్ల వెడల్పు, 4.313 కిలో మీటర్లు పొడవు మట్టి ఆనకట్ట, రాక్‌టో, సీపేజ్ డ్రైనేజీ నిర్మాణం, పెంచిన ఒక మీటరు ఆనకట్టకు లోపలి వైపు రాతి పరుపు (స్టోన్ రివిట్మెంట్) వంటి పనులు రూ.35 కోట్లతో చేపట్టారు. అలాగే.. రూ.55 కోట్లతో ఆరు కొత్త గేట్లు అమర్చే పనులు చేపట్టారు. మట్టి పనులు, గేట్లు ఏర్పాటుకు రూ.90 కోట్లు, భూ సేకరణతో కలిపి రూ.135 కోట్లు గతంలో మంజూరు చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపేశారు. ఆరు కొత్త గేట్లు ఏర్పాటు కోసం 2023 సెప్టెంబరులో గేట్ల తయారీ (ఫ్యాబ్రికేషన్) పూర్తి చేశారు. డ్యాంలో నీరు దిగువకు వెళ్లకుండా స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చాల్సి (ఎరక్షన్) ఉంది. పాత గేట్ల ఇనుప తాళ్ల (రోప్స్) తొలగించి కిందకు దింపేశారే తప్ప కొత్త గేట్లు అమర్చలేదు. వరద వస్తే ఆనకట్టకు ముప్పు ఉంటుందని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. స్పందించిన ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఐ కబీర్‌బాషా ఇంజనీరుపై ఒత్తిడి తెచ్చి ఎట్టకేలకు ఐదు గేట్లు కొత్తవి ఏర్పాటు చేశారు. భూ సేకరణ చేయకపోవడం రైతులకు శాపంగా మారింది. భూ సేకరణ చేయకపోవడంతో ఆనకట్ట ఎత్తు పెంచినా అదనంగా టీఎంసీ నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఉంది.

ప్రభుత్వానికి ప్రతిపాదన

కూటమి ప్రభుత్వం వచ్చాక తక్షణమే అసంపూర్తి పనులు పూర్తి చేస్తారని రైతులు ఆశించారు. ఏడాదిన్నర గడిచినా ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. రూ.57 కోట్లు విలువపై పనులు కాంట్రాక్టరు చేశారు. అందులో రూ.27 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు. బకాయి బిల్లులు చెల్లింపులు, 627 ఎకరాల భూ సేకరణ, అసంపూర్తి పనులు పూర్తి చేయాలంటే రూ.92 కోట్లు నిధులు ఇవ్వాలంటూ టీబీపీ ఎల్లెల్సీ ఆదోని డివిజన్ ఇంజనీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వర్షాలు, వరదలు లేకపోవడంతో పనులు చేసేందుకు అనుకూలమైన సమయం ఇది. ప్రభుత్వం నిధులు ఇస్తే తప్ప కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టే అవకాశం లేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గాజులదిన్నె ప్రాజెక్టు (సంజీవయ్య సాగర్)

ప్రాజెక్టు	: గాజులదిన్నె ప్రాజెక్టు
సామర్థ్యం	: 4.50 టీఎంసీలు
ఆయకట్టు	: 25,454
ఎఫ్ఆర్ఎల్ లెవల్	: 377 మీటర్లు
ఆనకట్ట ఎత్తు పంపు పనులు పూర్తయితే..	
సామర్థ్యం	: 5.50 టీఎంసీలు
ఎఫ్ఆర్ఎల్ లెవల్	: 378 మీటర్లు
ఆయకట్ట పొడవు	: 4.313 కిలో మీటర్లు
మంజూరైన నిధులు	: రూ.135 కోట్లు (భూ సేకరణతో కలిపి)
ఇప్పటి వరకు చేసిన ఖర్చు	: రూ.57 కోట్లు
బిల్లు బకాయి	: రూ.27 కోట్లు
తాగునీటి ఆధారం	: డోన్, ఎమ్మిగనూరు, కోడుమూరు, కృష్ణగిరి పట్టణాలు సహా పలు గ్రామాలు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం



గాజులదిన్నె ప్రాజెక్టు 4.50 నుంచి 5.50 టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు వీలుగా మట్టి ఆనకట్ట ఒక మీటరు ఎత్తు పెంచడం, పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు కోసం రూ.135 కోట్లతో పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టరు ఇప్పటి వరకు రూ.57 కోట్లు పనులు చేస్తే రూ.27 కోట్లు బిల్లులు బకాయి ఉన్న మాట నిజమే. భూ సేకరణ, అసంపూర్తి పనుల కోసం రూ.92 కోట్లు నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పనులు మొదలు పెడతాం. వేదవతి ప్రాజెక్టు సహా గాజులదిన్నె ప్రాజెక్టు అసంపూర్తి పనులను ప్రాధా న్యతగా తీసుకొని పూర్తి చేయమని సీఎం చంద్రబాబు సంకల్పం

- పాండురంగయ్య, ఈఈ, టీబీపీ ఎల్లెల్సీ డివిజన్, ఆదోని

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిశీలించండి

- పార్లమెంట్‌లో ఎంపీ బస్తిపాటి నాగరాజు


పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ

కర్నూలు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలను పరిశీలించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. బుధవారం పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా జీవో అవర్‌లో ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ప్రకృతి విపత్తులు, జాతీయ అత్యవసర పరిస్థితులు, కొవిడ్ లాంటి క్లిష్ట సమయాల్లో దేశానికి నిబద్ధతతో సేవలు అందించారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించినా వారి సేవలకు గుర్తింపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక, వృత్తిపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నరని 3వ పీఆర్సీ న్యాయమైన డిమాండ్లు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో పాటు రిటైర్మెంట్ పెన్షన్ల సవరణ ఇంకా పరిష్కారం కాలేదన్నారు. పీఆర్సీ అమలుకు అవసరమైన ఆర్థత మినహాయింపులు ఇవ్వాలని, పెన్షన్ల సవరణను లాభ నష్టాలపై ఆధారపకుండా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్లకు అనుగుణంగా పెన్షన్లను అమలు చేయాలని అన్నారు.

రేపు క్లస్టర్ వర్సిటీలో జాబ్ మేళా

కర్నూలు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 5న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ జీ. శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో ఎక్సెల్ ఎడ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. డిగ్రీ, ఇంటర్, పది చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సర్టిఫికెట్లు జిరాక్స్‌లు, 3 ఫొటోలు, ఆధార్, బయోడేటాతో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

వైసీపీ ఎంపీటీసీపై దాడి

- విచారణ చేస్తున్న తాలుకా పోలీసులు

నంద్యాల టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె గ్రామంలో వైసీపీ నాయకుడు ఎంపీటీసీ హరినాథరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. హరినాథ్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం భీమవరం రోడ్డులో ఉన్న పొలానికి వెళ్లి పనులు ముగించుకుని వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆరుగురు కట్టెలతో, మరణాయుధాలతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో బాధితుడికి తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

మేం చచ్చాక కాలనీకి వస్తారా...?

- వైద్యులపై వాల్మీకి నగర్ వాసుల ఆగ్రహం
- కాలనీలో రెండు డెంగీ కేసులు నమోదు


బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

కోసిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'మేము చచ్చాక కాలనీకి వస్తారా.. అసలు మా కాలనీని ఎందుకు పట్టించుకోవడం లేదని వైద్యులు, పంచాయతీ అధికారులపై కోసిగి 3వ వార్డు వాల్మీకినగర్ కాలనీవాసులు ఆగ్రహించారు. బుధవారం వాల్మీకినగర్‌లో బుగేని శ్రీనివాసులు, మహదేవి, దంపతుల కుమార్తె శ్రీవిద్య (8 నెలలు) డెంగీ బారిన పడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అదే కాలనీకి చెందిన మరో బాలుడు దేవాన్ష్ (16 నెలలు) డెంగీతో ఆదోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే కాలనీకి మొదటిసారి వచ్చిన వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బందిపై కాలనీ వాసులు ఆగ్రహంతో ఊగిపోయారు. ఊరి చివర సబ్ సెంటర్‌లో ఉండే వైద్యసిబ్బంది కూడా తమ కాలనీ వైపు రాలేదని మండిపడ్డారు. వారానికి ఒకసారి కూడా వైద్యసిబ్బంది కాలనీవైపు చూడడం లేదని కాలనీకి చెందిన మహిళలు గంగమ్మ, గుడిసె లక్ష్మి, నేసే లక్ష్మి, ఈరమ్మ, కోసిగమ్మ తదితరులు మండిపడ్డారు. అలాగే డ్రైనేజీ కాలువలు క్లీన్ చేయడం లేదని, దోమలు ఉన్నా ఫాగింగ్ చేయడం లేదని, నెలకొకసారి డ్రైనేజీలు శుభ్రపరిచినా కాలువలు తొలగించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మంజునాథ్, డా.రాజ్‌కిరీటి, వైద్యసిబ్బంది ఈశ్వరమ్మ, రాముడు, సుజాత, మల్లికార్జున, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసీ నాగప్ప వీధికి చెందిన ప్రసాద్‌రావు (36) బుధవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రసాద్‌రావు ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. గత కొద్ది కాలంగా ఆ మహిళతో విభేదాలు వచ్చాయి. రెండు రోజుల క్రితం ఆ మహిళ, కొడుకు మాటలకు ప్రసాద్‌రావు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆ ఇద్దరిపై ప్రసాద్‌రావుపై చేయి చేసుకున్నాడు. ఆ తర్వాత ఆయన తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే గుర్తించిన తల్లి స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భగవద్గీత కంఠస్థంలో స్వర్ణగౌరి సత్తా


స్వామీజీ గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న స్వర్ణగౌరి దంపతులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో అవధూత దత్తపీఠం వేదికగా జరిగిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో కొలిమిగుండ్లకు చెందిన స్వర్ణగౌరి ప్రతిభ కనబరచి స్వర్ణ పతకం సాధించారు. ఈమేరకు ప్రముఖ పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నారు. సంపూర్ణ భగవద్గీత కంఠస్థం పేరుతో ఈపోటీలు నిర్వహించగా వివిధ రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొన్నారు. స్వర్ణగౌరి భగవద్గీతలోని 700 శ్లోకాలను ఉచ్చారణ, అక్షర దోషం లేకుండా చెప్పారు. స్వర్ణగౌరి, సూర్యనారాయణరెడ్డి దంపతుల ప్రతిభను పలువురు అభినందించారు.

వ్యవసాయ సహకార సంఘాల సమరభేరి..

- 6 నుంచి సమస్యల సాధనకు ఆందోళన కార్యక్రమాలు


కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డితో ఉద్యోగులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు తమ సమస్యల సాధన కోసం ఐక్య వేదికగా ఏర్పాటై ఈ నెల 6వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి తమ సమస్యలు పరిష్కరించమని విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయాలని నిర్ణయించామని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక కర్నూలు జిల్లా అధ్యక్షుడు హనీఫ్ బాషా తెలిపారు. ఇందులో భాగంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బుధవారం ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ డి. విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ నెల 6వ తేదీ నుంచి వివిధ దశల్లో జనవరి 5వ తేదీ వరకు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళికను విలేకరులకు యూనియన్ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హరినాథరెడ్డి, సతీష్, పుల్లయ్య, కోటేశ్వరరెడ్డి, మాలిక్ బాషా, ప్రదీప్ కుమార్, సత్యనారాయణ, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

జోరుగా మాస్ కాపీయింగ్

- ఎంపీహెచ్‌డబ్ల్యూ పరీక్షల్లో ఇష్టారాజ్యం


పరీక్షా కేంద్రం బయట స్లిప్పులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఫీమేల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్ ఫీమేల్) పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్ సాగుతోంది. ఈ నెల 1వ తేదీ నుంచి కర్నూలు, అనంతపురం కళాశాలలకు చెందిన విద్యార్థులు కర్నూలులోని ఫీమెల్ శిక్షణ కేంద్రంలో పరీక్షలు రాస్తున్నారు. అయితే.. కొందరు ఇన్విజిలేటర్లు ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలతో కుమ్మక్కై మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు కాలేజీల యాజాన్యాలు విద్యార్థుల డబ్బులు వసూలు చేసి డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందికి ముట్టచెప్పినట్లు విమర్శల వస్తున్నాయి. పరీక్షకు చీఫ్ ఎగ్జామినర్‌గా డీఐవో వ్యవహరిస్తున్నారు. పరీక్షా కేంద్రం (ప్రాంతీయ శిక్షణా కేంద్రం ఫీమేల్) ఆవరణలో మైక్రో జిరాక్స్ కాపీలు కనిపిస్తున్నాయి.

- ఈ విషయమై డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్‌ను వివరణ కోరగా.. మాస్ కాపీయింగ్ వ్యవహారం నా దృష్టికి రాలేదని, రేపటి నుంచి తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల స్థలాలు, లబ్ధిదారుల జాబితాపై విచారణ

- సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

కర్నూలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకం' అమలు చేసింది. పేదలకు ఇంటి పట్టాలు, పక్కా ఇల్లు నిర్మాణానికి అనుమతులు కూడా ఇచ్చారు. పలు గ్రామాల్లో భూసేకరణలో, పక్కా ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇళ్ల స్థలాలు, లబ్ధిదారులు, అర్హులు, అనర్హులు ఎందరు ఉన్నారో లెక్క తేల్చి నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో భాగంగానే నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్ సిరి.. ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు పత్తికొండ ఆర్డీవోలు, కర్నూలు కార్పొరేషన్ కమిషనర్, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు కమిషనర్లను ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2019-20 నుంచి 2024-25 వరకు నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల స్థలాల సమాచారాన్ని పక్కాగా చేర్చాలని అందులో పేర్కొన్నారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) ఆదేశాల మేరకు వివరాలు సేకరించాలని ఆదేశిస్తే కర్నూలు హౌసింగ్ పీడీ, ఏపీ టిడ్కో కర్నూలు ఎస్ఈ మినహా ఇతర అధికారులు సంబంధిత సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. తక్షణమే వివరాలు సేకరించాలని ఆదేశించారు. అలాగే పేదలకు ఇళ్ల పంపిణీ కోసం సేకరించిన భూముల వివాదాల వివరాలు కూడా అందజేయాలని సూచించారు. పది అంశాలతో ఫార్మట్‌ను తయారు చేశారు.

వలస వెళ్లిన విద్యార్థి.. పాము కాటుతో మృతి

కోసిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన నరేంద్ర (13) పాము కాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కోసిగి మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన హల్వి మహానంది, నర్సమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో రెండో కుమారుడు నరేంద్ర స్వగ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. నరేంద్ర తల్లిదండ్రులతో పాటు కర్ణాటక రాయచూరు జిల్లాకు వలస వెళ్లాడు. మంగళవారం పత్తి పొలంలో పనిచేస్తూ పాము కాటుకు గురయ్యాడు. గమనించిన తల్లిదండ్రులు రాయచూరులోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. బుధవారం నరేంద్రను స్వగ్రామమైన వందగల్లుకు తీసుకువచ్చారు. నరేంద్ర చదువుతున్న పాఠశాల హెచ్ఎం గిడ్డయ్య, ఉపాధ్యాయులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

త్రిమూర్తుల స్వరూపమే 'దత్తాత్రేయుడు'



కర్నూలు నగరంలో ముస్తాబైన సాయిబాబా ఆలయాలు

- నేడు దత్త జయంతి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గురుతత్వానికి ఆద్యుడు, త్రిమూర్తుల స్వరూపుడు, దేవతలకు జ్ఞాన బోధన చేసిన దత్తాత్రేయ స్వామి జయంతిని గురువారం జిల్లాలోని హైందవ భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఏటా మార్గశిర పౌర్ణమి రోజున దత్త జయంతి విచ్చేస్తుంది. కాగా ఈ ఏడాది గురువారం రోజున స్వామివారి జయంతి రావడం భక్తులు విశేషంగా భావిస్తున్నారు. జిల్లాలోని వివిధ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అఖండ సాయినామ పారాయణాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. షిరిడీ సాయినాధుడు సాక్షాత్తు దత్తాత్రేయుడి స్వరూపంగా భక్తులు ఆయనను కొలుస్తారు. ఈ నేపథ్యంలో దత్తజయంతికి సాయిబాబా ఆలయాలు ప్రత్యేక పూజాది కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని నగరంలోని దక్షిణ షిరిడీగా పేరొందిన సాయిబాబా దేవస్థానంలో బుధవారం నుంచి గురువారం వరకు 24 గంటల పాటూ అఖండ సాయినామ స్మరణ చేపట్టారు.

గురువారం రోజున విష్ణు సహస్రనామ పారాయణాలు, మహాభిషేకము, అన్నప్రసాదం వితరణ, దునిపూజ, సాయి వ్రతము, మధ్యాహ్న హారతి, సాయంత్రం సంధ్యా హారతి, పల్లకీ సేవ, అల్పాహార వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు దేవస్థానం కార్యదర్శి ఎస్‌జీ మహబలేష్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని హనుమాన్ ద్వారకామాయి దేవాలయంలో, కొత్తపేటలోని నాగసాయి ఆలయంలో, వెంకటరమణ కాలనీలోని సాయి మందిరంలో ప్రత్యేక పూజలు, విశేష హారతి నిర్వహిస్తున్నారు.

మల్లన్న సేవలో టీమిండియా క్రికెటర్లు


ఆలయంలో టీమిండియా క్రికెటర్లు

శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను టీమిండియా క్రికెటర్లు జితేష్ శర్మ, రవి బిష్ణోయ్‌లు బుధవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానగోపురం వద్ద అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. క్రికెటర్లు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

మరణంలోనూ వీడని బంధం

కోసిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కష్టసుఖాల్లో ఒకరికొకరు కలకాలం తోడు ఉంటాననీ చేతిలో చేయేసి ఒట్టు పెట్టిన ఆ దంపతులూ కాటికి కూడా కలిసేవెళ్లారు. భర్త మరణించిన కొద్దిసేపటికే భార్య కూడా తనువు చాలించిన విషాద ఘటన కోసిగి మండలంలోని డి.బెళగల్ గ్రామంలో జరిగింది. వివరాలు.. డి.బెళగల్ గ్రామా నికి చెందిన వై.పెద్ద వీరారెడ్డి(75), భార్య వై.పారిజాతమ్మ(73) ఇద్దరు కలిసి వ్యవసాయ పనులు చేసుకుం టూ జీవించేవారు. ఇటీవల పెద్ద వీరారెడ్డి అనారోగ్యానికి గురికావడంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలిసిన భార్య వై.పారిజాతమ్మ కూడా తట్టుకోలేక గంట వ్యవధిలోనే తనువు చాలించింది. ఒకే రోజు భార్యభర్తల మృతితో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- అనారోగ్యంతో భర్త మృతి
- గంట వ్యవధిలోనే భార్య మృతి
- డి.బెళగల్‌లో విషాదం


వీరారెడ్డి, పారిజాతమ్మ(ఫైల్)

డ్రిప్ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు

- 12 శాతం నుంచి 5 శాతానికి: ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాస్


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డ్రిప్ పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించిందని ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఏపీడీ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సూక్ష్మ సేద్య పథకం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎస్టీ తగ్గుదల వల్ల డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలన్న రైతులకు ఏ మేరకు ప్రయోజనం కలుగుతుందో వివరించారు. ఈ సంవత్సరం కర్నూలు జిల్లాలో డ్రిప్, స్ప్రింకర్ల యూనిట్లను 7వేల హెక్టార్లలో లక్ష్యం చేసుకున్నట్లు తెలిపారు. 5 ఎకరాల్లోపు పొలం ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, పదెకరాల పొలం ఉన్న రైతులకు 90 శాతం రాయితీ, పదెకరాలకు పైబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీ ఉందని తెలిపారు. త్వరితగతిన దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ డ్రిప్ ఏర్పాటు చేసేలా అనుమతి మంజూరు చేస్తున్నట్లు పీడీ శ్రీనివాసులు, ఏపీడీ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. ఇప్పటి వరకు 3,245 మంది రైతులు, 4,045 హెక్టార్లకు డ్రిప్‌ను ఏర్పాటు చేసేందుకు రైతులు తమ వాటాను చెల్లించారని తెలిపారు.

లాభసాటి పంటలు సాగు చేసుకోవాలి

- ఎమ్మెల్యే జయసూర్య
- దుద్యాల-ఆత్మకూరు బీటీ రోడ్డుకు భూమి పూజ

కొత్తపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా లాభసాటి పంటలు సాగు చేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. బుధవారం మండలంలోని దుద్యాల గ్రామ సచివాలయ ఆవరణలో మండల వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం అధ్యక్షతన నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఎప్పుడూ ఒకే పంటను సాగు చేయకుండా మార్పిడి చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అలాగే పంచ సూత్రాలతో లాభసాటి వ్యవసాయ విధానాలను రైతులకు కరపత్రాలు చదివి వివరించారు. రైతులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతన్న సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు

దుద్యాల-ఆత్మకూరు బీటీ రోడ్డుకు ..

మండలంలోని దుద్యాల-ఆత్మకూరు బీటీ రోడ్డు రహదారి నిర్మాణం కోసం రూ.2కోట్ల నాబార్డు నిధులతో మంజూరైన పనులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్-167 కేకింద నేషనల్ హైవే రహదారి దుద్యాల మీదుగా వెళ్తుందని, గ్రామస్థుల కోరిక మేరకు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. దుద్యాలలో రెండో విడతలో కూడా సీసీ రోడ్ల కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఎన్‌హెచ్167కే కింద భూమి కోల్పోయిన కొంత మంది రైతులకు ఇంకా పరిహారం అందలేదని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని తహసీల్దార్ ఉమారాణిని ఎమ్మెల్యే ఆదేశించారు. దుద్యాల టీడీపీ నాయకులు మల్లారెడ్డి, పీఎండీ రఫీ, గ్రామానికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో మేరీ, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, ఏపీవో విమలమ్మ, ఎంఈవో నాగరాజు, పీఐయూ డీఈఈ వీరన్న, ఏఈ వెంకటరమణ, మండల కన్వీనర్లు లింగస్వామి గౌడు, మహేశ్వరరెడ్డి, నాయకులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

యునానిలో.. ఇక్కట్లు

- వైద్యాధికారి సరే.. మందులేవి?
- ఇబ్బంది పడుతున్న రోగులు


యునాని వైద్యశాల


మందులు లేక ఖాళీగా దర్శనం ఇస్తున్న ర్యాక్‌లు

కొత్తపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యునాని వైద్యశాలలో మందుల కొరత వేధిస్తోంది. రెండేళ్లుగా మందులు సరఫరా కావడం లేదు. దానితో రోజురోజుకు ఆదరణ తగ్గిపోతోంది. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 20ఏళ్ల క్రితం ఓ చిన్నపాటి గదిలో యునాని వైద్యశాలను ఏర్పాటు చేశారు. ఓ వైద్యాధికారితో పాటు అటెండరును నియమించారు. చర్మ, కీళ్లనొప్పులు, ఊపిరి తిత్తులు, మొలలు, ఫసిరికలు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి వైద్యమందించి మందులను ఇచ్చేవారు. ప్రస్తుతం మందులు అందుబాటులో లేవు. వైద్యాధికారి మాత్రం ప్రతిరోజూ విధులకు హాజరవుతూ వైద్యం కోసం వచ్చిన రోగులకు వైద్య సలహాలు ఇస్తున్నారే తప్ప.. మందులు లేవు అని పంపుతున్నారు. దాంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. యునాని వైద్యశాలలో రెండేళ్లుగా మందులు లేని మాట వాస్తవమేనని యునాని వైద్యశాల డాక్టర్ జమాలుద్దీన్ తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఈ విషయంపై కడప యునానీ రీజనల్ డైరెక్టర్ శేఖర్‌రాజును 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో వివరణ కోరగా.. మందుల కొరత ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము. వారంలోపు బడ్జెట్ కూడా వస్తుంది. యునానికి అన్ని రకాల మందులు సరఫరా చేస్తామన్నారు.

జేఎన్‌టీయూ బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక పోటీలు


మాట్లాడుతున్న నారాయణరెడ్డి

పాణ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జేఎన్‌టీయూ బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ నారాయణరెడ్డి ప్రారంభించారు. ఎంపికైన మహిళా క్రీడాకారులు ఈనెల చివరి వారంలో బెంగుళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. పురుషులు జనవరిలో చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపిక సెలక్షన్ కమిటీ సభ్యులుగా సురేష్‌బాబు, చంద్రమౌళి వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్, పీడీలు చంద్రారెడ్డి, వెంకటేష్, వెంకటేశ్ నాయక్, మునిశంకర్, రామునాయక్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

పాణ్యం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం పార్మసీ పార్మా డీ విద్యార్థిని బి.వాసవీలత సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మాధుసూదనశెట్టి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మార్చి 2నుంచి విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ చెస్ పోటీలలో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. జేఎన్‌టీయూఏ చైర్మన్ శాంతిరాముడు, ఎండీ శివరాం, డైరెక్టర్ అశోక్‌కుమార్ విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పీడీ మునిశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పాలక మండలి ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్నపాలక మండలి

బండి ఆత్మకూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు గ్రామం లో వెలసిన చెన్నకేశవ, ఆంజనేయ స్వామి ఆలయాల పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా సాగింది. బుధవారం చైర్మన్‌గా కమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, సభ్యులుగా బాలరగన్న, చిన్న శేషన్న, శారద, రాములమ్మ, పార్థసారధి, జయలక్ష్మి, రఘునాథరెడ్డి, గౌతమకుమారశర్మల చేత గ్రూప్ ఆలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో ఆకృతి నాగప్రసాద్ ప్రమాణం చేయించారు. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ నాగ శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రుడు, నాయకులు మహేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, నాగశేషారెడ్డి, రామలింగారెడ్డి,నాగిరెడ్డి, నారాయణరెడ్డి, రసూల్, విజేయుడు తదితరులు పాల్గొన్నారు.

కౌశలం పరీక్ష పరిశీలన

మిడుతూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఇంట్లోనే ఉంటూ ఉద్యోగం చేసేందుకు కౌశలం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దశరథరామయ్య తెలిపారు. బుధవారం మిడుతూరులోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 సచివాలయాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెసేజ్ వచ్చిన అభ్యర్థులు సచివాలయ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి పరీక్ష రాయాలని కోరారు.

ఆది దంపతులకు వార పూజలు

శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లతో పాటు పరివార దేవతలకు వార పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయంలోని రత్నగర్భ గణపతికి, సాక్షి గణపతి స్వామికి ఉదయం విశేషార్చనలు అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల సమయంలో ఆలయ ప్రాంగణంలో జ్వాలావీరభద్రుడికి పంచామృతాలు, శుద్ధజలాలతో అభిషేకించి షోడశోపచార పూజలు చేసినట్లు ఈఓ శ్రీనివాసరావు చెప్పారు.

బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈఘటన సున్నిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. బాధితుడి వివరాల ప్రకారం బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన శివస్వామి రాజు మల్లన్న దర్శనం చేసుకుని లింగాలగట్టుకు బైక్‌పై వెళ్తున్నాడు. నీలంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయం మలుపు వద్ద మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చిన బైకును ఢీకొట్టింది. శివస్వామి కాలికి తీవ్ర గాయాలు కాగా సున్నిపెంట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తి అరెస్టు

శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరుస నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. బుధవారం శ్రీశైలం టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా షేక్ మస్తాన్ అనే వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. గతంలో కూడా ఆయన మద్యం రవాణ, దొంగతనం నేరాల్లో 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. నిందితుడి నుంచి బైకు, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

జూదరుల అరెస్టు

నంద్యాల టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో బుధవారం రాత్రి జూదరులను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాలిలా.. సంధ్య థియేటర్ పక్కనే పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.21 వేలు నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఐదుగురు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ ఆడుతున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో క్రైం కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రబీ పూర్తయ్యే వరకు సాగునీరు అందించాలి

- మండల సమావేశంలో సభ్యుల డిమాండ్


ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యుడు

జూపాడుబంగ్లా, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): రబీ సీజన్ పూర్తయ్యే వరకు కేసీ కాల్వ నుంచి సాగునీరు అందించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కేసీ కాల్వ నుంచి పొలాలకు ఎన్నినెలలు సాగునీరు ఇస్తారో తెలియజేయాలని కేసీకాల్వ ఏఈ శ్రీనివాసనాయక్‌ను కోరారు. తాము సమావేశంలో అటువంటి విషయాలు చెప్పకూడదని ఏఈ అన్నారు. సమాధానం చెప్పలేని అధికారి సమావేశానికి ఎందుకువచ్చారని తీవ్రస్థాయిలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సాగునీరు ఎప్పటివరకు ఇస్తారనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏఈ సమాధానం ఇవ్వడంతో సభ్యులు సద్దుమణిగారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుచేసిన రైతులు నష్టపోయారని, ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అనుమతి వచ్చిన వెంటనే కొనుగోలు చేస్తామని చెప్పారు. ఉల్లిరైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నాటుసారా, బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తేగా, ఫిర్యాదు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని అబ్కారీశాఖ ఎస్ఐ శ్రీనివాసులును తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో గోపికృష్ణ, ప్రజాప్రతినిధలు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

- డీఏవో వెంకటేశ్వర్లు


ఈర్నపాడులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీఏవో వెంకటేశ్వర్లు

బండిఆత్మకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టి అధిక లాభాలు ఆర్జించాలని డీఏవో వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండలంలోని ఈర్నపాడు రైతు సేవా కేంద్రంలో జరిగిన రైతన్న మీ కోసం గ్రామసభకు డీఏవో హాజరయ్యారు. ముందుగా ప్రకృతి వ్యవసాయసాగు చక్రం, సాగు తీరులను ఆయన అధికారులు, నాయకులతో కలసి పరిశీలించారు. డీఏవో మాట్లాడుతూ ప్రస్తుత రబీలో ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. తక్కువ పెట్టుబడులు, ఎక్కువ లాభాలు ఆర్జించే చిరు ధాన్యాలు, పండ్లు, ఆకుకూరల సాగు చేయాలని రైతులకు తెలిపారు. పంటలతో పాటు పాడి పరిశ్రమ అలవర్చుకోవాలని అన్నారు. వచ్చే మూడు సీజన్ల సాగుకు రైతుల సూచన మేరకు వ్యవసాయ సిబ్బంది కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల ఆర్ఎస్కేలలో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మ, ఎంపీడీవో గాయత్రి, ఏవో పవన్‌కుమార్, డాక్టర్ జ్యోత్స్న, అబ్దుల్, లక్ష్మయ్య, వసుంధర,టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


విత్తన ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఏడీఏ హేమలత

ఆత్మకూరు రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు పొంది ఆర్థికాభివృద్ధి చెందాలని సహాయ వ్యవసాయ సంచాలకులు హేమలత అన్నారు. బుధవారం మండలంలోని కరివేన గ్రామంలో రైతన్న మీకోసం నిర్వహించారు. కార్యక్రమంలో వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ అరుణ, టీడీపీ మండల అధ్యక్షుడు రవీంద్రబాబు, టీడీపీ నాయకులు కొండలరావు, దినకర్, శరత్‌బాబు, శివశంకరశర్మ, వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వంలోనే అన్నదాతల సంక్షేమం సాధ్యపడుతోందని ఆత్మకూరు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు షహబుద్దీన్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతన్న.. మీకోసం నిర్వహించారు. పంచ సూత్రాల కరపత్రాలను ఆవిష్కరించి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు అష్రఫ్ అలి, కాటం రామిరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులున్నారు.

మహిళలకు అండగా 'శక్తియాప్'

- మహిళా స్టేషన్ సీఐ జయరాములు

నంద్యాల టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో ప్రతి ఒక్కరూ శక్తియాప్‌ను ఉపయోగిస్తే తక్షణమే సాయం అందిస్తామని మహిళా స్టేషన్ సీఐ జయరాములు అన్నారు. బుధవారం నంద్యాలలోని గవర్నమెంట్ ఆసుపత్రిలోని ట్రైనింగ్ నర్సులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. ఏపీలో శక్తి టీంల పనితీరును, ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. ఆపదలో ఉన్నప్పుడు 112, 1930 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఆర్.నాయక్, దినేష్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ సంఘం 4వ మండల మహాసభను నిర్వహించారు. ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆరోపించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయికుమార్, కార్యదర్శిగా తేజ, సభ్యులను ఎన్నుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


హాజీనగర్‌లో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్న బూత్ అడ్వైజరీ కమిటీ సభ్యులు

నందికొట్కూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ బూత్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, డోన్ వ్యవసాయ కమిటీ సింగిల్ విండో చైర్మన్ ఎల్లా గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 55, 58, 59, 61 బూత్‌ల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పట్టణంలో రోడ్లు, డ్రైన్‌లు, తాగునీటి వ్యవస్థలపై ఉన్న సమస్యలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ సభ్యులు లాయర్ నాగముని పాల్గొన్నారు.

షాపులు వేలం

నంద్యాల కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానానికి చెందిన షాపులను బుధవారం ఆలయ తనిఖీ అధికారి గోపి, ఈవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఐదు షాపులను రూ.54600 దక్కించుకున్నారు. వేలంలో ఆలయకమిటీ సభ్యులు, డిపాజిట్‌దారులు, సిబ్బంది కిరణ్ పాల్గొన్నారు.

6న ప్రథమ నందీశ్వరాలయంలో పోటీలు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రథమనందీశ్వరాలయంలో ఈనెల 6న వాసవీ కన్యకాప రమేశ్వరీ ఆల్‌ఆర్ట్స్ డెవలప్‌మెంట్ సొసైటీ, లక్ష్మీనరసింహస్వామి ఆల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అపర్ణ దీపిక, మామిడి వెంకటేశ్వర్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ఉంటాయన్నారు. కళాభిమానులు, సాహిత్యాభిలాషులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9160240807, 9492945753ను సంప్రదించాలన్నారు.

నేడు దత్త జయంతి



ఆత్మకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం దత్తజయంతి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఉదయం 6గంటలకు కాకడహారతి, 7:30గంటల నుంచి షిర్డీసాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాత్రి 7.30గంటలకు సాయి పల్లకి సేవ, తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవాన్ని ముగించనున్నట్లు ఆలయ అర్చకులు చెప్పారు. విష్ణుమూర్తికి ప్రీతికరమైన మార్గశిరమాసంలో పౌర్ణమి రోజున దత్తాత్రేయుడి జయంతోత్సవాన్ని ఆత్మకూరు ప్రాంతంలో ప్రతిఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

మదర్ థెరిస్సా స్ఫూర్తితో సాయం

నంద్యాల రూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా స్ఫూర్తితో సాయం చేస్తున్నట్లు రామకృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో రోగులకు ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ల రాజేశ్ సహకారంతో ఉచితంగా మందులు, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీజిల్లా చైర్మన్ దస్తగిరి, ప్రజా పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమళ్ల రహీం, నూర్‌బాషా, ఉస్మాన్, పాల్గొన్నారు.

మహానంది ఈవోకు మాతృ వియోగం


జయమ్మ (ఫైల్)

మహానంది, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి మాతృ వియోగం కలిగింది. ఈవో తల్లి నల్లకాల్వ జయమ్మ(75) బుధవారం తెల్లవారుజామున స్వగ్రామం వెలుగోడు మండలం అబ్దులాపురంలో అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని ఆలయ ఏఈఓ మధుతో పాటు పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, వేదపండితులు, ప్రధాన అర్చకులు అర్జునశర్మ, రాఘవశర్మ సందర్శించి నివాళులు అర్పించారు.

హుసేన్‌సాహెబ్‌కు ఘన నివాళి


హుసేన్‌సాహెబ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో బుధవారం దివంగత మాజీ సర్పంచ్ మోమిన్ హుసేన్‌సాహెబ్ 34వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కరివేన గ్రామ సమీపంలోని మానవతా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సేవా సంఘం గౌరవాధ్యక్షుడు మోమిన్ మునీర్‌బాషా, కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ.రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పువ్వాడి భాస్కర్


నియామక పత్రం అందుకుంటున్న పువ్వాడి భాస్కర్

ఆత్మకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పువ్వాడి భాస్కర్ నియమితులయ్యారు. బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గొంట్లా రామ్మోహన్‌రావు నియామక పత్రాన్ని అందించారు. పువ్వాడి భాస్కర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకాన్ని ఉంచి ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఐవీఎఫ్ నిర్దేశించిన కార్యాచరణను సక్రమంగా కొనసాగించేందుకు తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఆయన ఎంపికపై పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి : ఎంఈవో


జూపాడుబంగ్లాలో మాట్లాడుతున్న ఎంఈవో చిన్నమద్దిలేటి

జూపాడుబంగ్లా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిషలు కృషిచేస్తుందని , పథకాలను అమలుచేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో చిన్నమద్దిలేటి సూచించారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జూపాడుబంగ్లాలోని భవితకేంద్రంలో పాల్గొని ఎంఈవో మాట్లాడారు. దివ్యాంగుల చిన్నారులకోసం అనేక సంక్షేమపథకాలు, కృత్రిమ అవయవాలను అందిజేస్తుందన్నారు. చిన్నారులకు ఆట పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు శ్రీధర్, సహితవిద్య ఉపాధ్యాయులు దుర్గాప్రసన్న, నాగేంద్రుడు, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

మహానంది: దివ్యాంగుల్లో కూడా ప్రతిభ ఉంటుందని దానిని వెలికితీసి సకలాంగులతో పోటీ పడేలా తీర్చిదిద్దాలని సెయింట్ ఆన్స్ సంస్థ అధ్యక్షురాలు మదర్ ఆంథోనమ్మ తెలిపారు. బుధవారం గోపవరం సమీపంలోని మానసిక వికలాంగుల పాఠశాలలో అంతర్జాతీయ దినోత్సవ వేడుకలు సిస్టర్ రీనా జోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అతిథులుగా మదర్ అంథోనమ్మ, ప్రాంతీయ విభాగం వైస్ ప్రొవిన్సియల్ సిస్టర్ అమృత పాల్గొన్నారు. మానసిక వికలాంగుల కేంద్రంలో దివ్యాంగుల స్వయం ప్రతిపత్తితో పాటు ఆర్థిక స్వావలంభన కోసం ఏర్పాటు చేసిన సెయింట్ ఆన్స్ ఒకేషనల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. వేదికపై మానసిక వికలాంగుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సిస్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.


మహానంది: మానసిక వికలాంగుల పాఠశాలలో ఒకేషనల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మదర్ ఆంథోనమ్మ


మానసిక వికలాంగుల నృత్య ప్రదర్శన

భవిత కేంద్రంలో..

లక్ష్యసాధనకు వైకల్యం అడ్డురాదని మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య తెలిపారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లి మండల పరిషత్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయిడు సుబ్బన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీలు హైమవతి, సురేఖ,సుబ్బారెడ్డి, ఉపాధ్యాయిలు సికిందర్ ఆజాద్,సుమన్, సుజాతలు పాల్గొన్నారు.

పాణ్యం: స్థానిక భవిత సెంటర్‌లో బుధవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, ఐఆర్‌టీలు శివసాయిప్రసాద్, సంపూర్ణరావు, కృష్ణప్రియ, శివప్రసాద్, రాజశేఖర్, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిడుతూరు: అంతర్జాయతీ దివ్యాంగ దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఫైజున్నిసా, మల్లికార్జుననాయక్, రిటైర్డు ఎంఈవో శ్రీనాథ్, హెచ్‌ఎంలు సాయి తిమ్మయ్య, ప్రేమ్ కుమార్, ఐఆర్‌టిలు షహనాజ్, మియ్యా బాష, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పాణ్యంలో ర్యాలీ..


మిడుతూరు: మాట్లాడుతున్న ఎంఈవో

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

బనగానపల్లెను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా

● రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచే పట్టణంలో సుమారు రూ.60కోట్లకు పైగా వ్యయంతో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్నం వరకు పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటనలు చేపట్టారు. పెట్రోల్‌బంకు వద్ద సర్కిల్ ఏర్పాటు, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో మంత్రి ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. నిర్దిష్ట వ్యవధిలో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించి ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. తెల్లవారుజాము నుంచే ఈపర్యటనలు చేపట్టడంతో అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, పంచాయితీ రాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ హుసేన్, టీడీపీ నాయకులు అత్తార్ కలాం, సలాం, ఇస్మాయిల్‌ఖాన్, అల్తాఫ్‌హుసేన్, పీ.ఏ విష్ణువర్దన్‌రెడ్డి, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


న్యాయవాదులతో మాట్లాడుతున్న మంత్రి బీసీ

ప్రజా సమస్యలను పరిష్కరించాలి: ప్రజల సమస్యలను పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి వినతులను స్వీకరించారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడే అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించారు.

మంత్రి బీసీని కలిసిన న్యాయవాదులు: రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంపై స్థానిక బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జెడ్.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మంత్రి బీసీకి కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పరుశురామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏపీపీ జాకీర్‌హుసేన్, జగన్నాథరెడ్డి, మూర్తి, జెఎస్.ప్రసాద్, రఘురామిరెడ్డి, అజాంహుసేన్, నరసింహారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రఫీ పాల్గొన్నారు.


అండర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు బుధవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే కార్యాలయంలో భూమా అఖిలప్రియ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు, మాజీ సర్పంచ్ చిన్న వెంకటన్న, నరసింహులు, వెంకటేష్, నరసిం హుడుతో పాటు 25 కుటుంబాలు టీడీపీ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ అవినీతి పాలనతో విసిగి పోయిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ : ఆళ్లగడ్డ తాలుకాలోని వివిధ మండలాల భాదితులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే అఖిలప్రియ పంపిణీ చేశారు. తాలుకాలోని 48 మంది కుటుంబాలకు రూ 22,62,837 చెక్కులను అందజేశారు.

టీడీపీ నాయకుడికి నివాళి : మండలంలోని కోట కందుకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దండు సుధాకర్ బుధవారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అక్కడికి చేరుకొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఉపాధ్యాయులు క్రీడల్లో రాణించాలి


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు

చాగలమర్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు క్రీడల్లో రాణించాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అన్నారు. బుధవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. త్రోబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను డివిజన్ స్థాయిలో 13, 14 తేదీల్లో క్రీడల్లో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎంలు జీవయ్య, మాబుహుసేన్, పీడీలు ఆశాజ్యోతి, శ్రీనాథ్‌రెడ్డి, దాదా పీర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

రుద్రవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదని ఫారెస్టుశాఖ నంద్యాల డిప్యూటీ డైరెక్టరు అనురాగ్‌మీనా అన్నారు. బుధవారం సాయంత్రం రుద్రవరంలోని ఫారెస్టుశాఖ నర్సరీని పరిశీలించారు. రేంజ్ పరిధిలోని డీవీ పెంట సెక్షన్‌లో చేపట్టిన సీఏ (కాంపెయినేషన్ అథారిటీ) 70 హెక్టార్లలో చేపట్టిన ప్లాంటేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట ఫారెస్టు రేంజర్ ముర్తుజావలి, ఇన్‌చార్జి డిప్యూటీ రేంజర్ మక్తర్‌బాషా, సెక్షన్ ఆఫీసరు రామకృష్ణ ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

దొర్నిపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ. కొత్తపల్లె, క్రిష్టిపాడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టుకు తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఉపాధ్యాయులుగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో మనోహర్‌రెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతోపాటు సంబంధిత పత్రాలు జత చేసి 5వ తేదీ లోపు దొర్నిపాడు మండల విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

డోన్ టౌన్: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్‌ఏ హిందీ ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ప్రభాకర్ బుధవారం తెలిపారు. మండలంలోని గుమ్మకొండ, ఎద్దుపెంట, చనుగొండ్ల గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు డోన్ ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ప్యాపిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అరటిని పీడిస్తున్న సిగటోక తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్త దీప్తి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని హుసేనాపురం, జక్కసానికుంట్ల, పీఆర్‌పల్లి, చంద్రపల్లి గ్రామాల్లో రైతులకు అరటి తెగుళ్లపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ సిగటోక సోకిన అరటి కాయలు, ఆకులపై మచ్చలు ఏర్పడుతాయన్నారు. ఈ మచ్చలు కనబడిన వెంటనే ఉద్యానవనశాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు రాజేంద్రప్రసాద్ జయంతి

ప్యాపిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి రాష్ట్రపతి బాబురాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలను బుధవారం స్థానిక శ్రీసరస్వతి శిశుమందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డి శబరి వ్యాఖ్యలపై హర్షం

డోన్ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని పార్లమెంటులో ప్రస్తావించిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి వ్యాఖ్యలపై వాల్మీకి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు బోయ ఈశ్వర్ నాయుడు హర్షం వ్యక్తంచేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వాల్మీకుల స్థితిగతులను సువివరంగా పార్లమెంటులో వివరించి ఎస్టీ జాబితా ఆవశ్య కతను తెలియజేసిన ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

● వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని పార్లమెంటు మాట్లాడిన ఎంపీ బైరెడ్డి శబరికి తాము రుణపడి ఉంటామని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

చాగలమర్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని హెచ్‌ఎం మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని మద్దూరు గ్రామంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మాబుహుసేన్, సీడబ్ల్యూ శాంతకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులు చదువులో రాణించాలి

● ఎంఈవో ప్రభాకర్

● ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

డోన్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజోతి): దివ్యాంగులు చదువులో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భవిత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంఈవో ప్రారంభించారు. అనంతరం భవిత కేంద్రంలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగుల పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎంఈవో-2 రఘు నాయక్, భవిత కేంద్రం ఐఆర్‌పీ మధుబాబు, రాణి పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలు మద్దమ్మచే కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. నగర పంచాయతీ మేనేజర్ సువరలక్ష్మి, మెప్మా ఎంసీ సూర్యనారాయణ, సీవో ఈద్రూష్ బాషా, దివ్యాంగులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: దివ్యాంగులను చిన్న చూపు చూడొద్దని కోవెలకుంట్ల సీఐ హనుమంత్ నాయక్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ హనుమంత్ నాయక్ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేసి దివ్యాంగులకు కేక్ తినిపించారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల జేఏసీ అధ్యక్షుడు అందనం దేవరాజు, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, ప్రచార కార్యదర్శి రమణ, మండల నాయకులు నారాయణ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, సుబ్బరాయుడు పాలొన్నారు.

కొలిమిగుండ్ల: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఏపీ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ హరీష్ అన్నారు. బుధవారం మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యాంగుడైన ఏజీఎం హరీష్‌ను దివ్యాంగులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటిరెడ్డి, రామచంద్ర, సునీల్, పెద్దిరాజు, చిరంజీవి, పెద్దయ్య పాల్గొన్నారు.


కోవెలకుంట్లలో దివ్యాంగుడికి కేక్ తినిపిస్తున్న సీఐ


డోన్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఈవో ప్రభాకర్


బేతంచెర్లలో కేక్‌ను కట్ చేస్తున్న దివ్యాంగురాలు మద్దమ్మ

చాగలమర్రి: దివ్యాంగ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అన్నారు. బుధవారం చాగలమర్రి భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ విద్యార్థులకు బహుమ తులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాబుహుసేన్, వైద్యులు సుబ్బనర్సయ్య, ఐఈఆర్పీలు మారెన్న, జగదీష్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ఎంఈవో రామచంద్రయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీపీఎస్ స్కూల్ హెచ్‌ఎం సుబ్బమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరటి రైతులు ఆందోళన చెందొద్దు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో ధరలు పుంజుకుంటున్న నేపథ్యంలో అరటి రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని ఉద్యానవన శాఖాధికారి శ్రీధర్, శాస్త్రవేత్త హేమాద్రి అన్నారు. బుధవారం మండలంలోని మధనంతపురం, చింతలాయపల్లె, అబ్దులాపురం, కోరుమానుపల్లె తదితర గ్రామాల్లో ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పర్యటించారు. అరటికి ధర లేదని వదిలేయకుండా చెట్టుపైనే ఉంచి, మందులు పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. త్వరలోనే అరటికి గిట్టు బాటు ధర లభిస్తుందన్నారు. అధికారులు రామ్మోహన్, బాషా, కొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ


పత్రాలు అందజేస్తున్న కమిషనర్, టీఈ రాఘవేంద్రగౌడు

డోన్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం 2.0 కింద మంజూరైన ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్ర గౌడు బుధవారం పంపిణీ చేశారు. స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని 14, 15 సచివాలయాల పరిధిలోని 26, 27, 28 వార్డుల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందించామన్నారు. వార్డు ఇన్‌చార్జిలు ఖాజాబాషా, జయరాముడు, లారీ బాషా పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వండి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు


మాట్లాడుతున్న రామచంద్రుడు

రుద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ చివరి ఆయకట్టుకు ఏప్రిల్ చివరి వరకు సాగునీరు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రైతులకు సాగునీటి విషయం లో అన్యాయం చేయవద్దని అన్నారు. రాష్ట్ర మంత్రులు, ఇరిగేషన్ అధికా రులు వరిపంట వేయవద్దని చెప్పడం అన్యాయమన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉన్నప్పుడు కూడా ఆరుతడి పంటలకు మాత్రమే సాగునీరు ఇస్తామనడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసయ్య శ్రీనివాసులు, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

బనగానపల్లె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు పరమేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హౌటు బికం మోర్ పవన్‌ఫుల్ అన్న అంశంపై పరమేశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకురాలు రేణుక, విద్యార్థినులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు

ఆళ్లగడ్డ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని మున్సిపల్ మేనేజర్ ఆనంద్ హెచ్చరించారు. ఆళ్లగడ్డ మున్సిపల్ పరిధిలోని పలు సచివాలయాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఒకటో సచివాలయంలోని హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పని వేళలు పాటించాలి

చాగలమర్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఎంపీడీవో తాహిర్‌హుసేన్ సూచించారు. 'సచివాలయాల్లో అందని సేవలు' అన్న శీర్షిక ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో బుధవారం చాగలమర్రి 3, 4 సచివాలయాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.

ట్రాఫిక్ మళ్లింపు

కోవెలకుంట్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్ల గ్రామంలో జరిగే కాశీనాయన ఆరాధనోత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు మళ్లింపు చేపట్టినట్లు సీఐ హనుమంత్ నాయక్ తెలిపారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ కాశీరెడ్డినాయన ఆరాధనోత్సవాలు రెండు రోజులపాటు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు.. ఈ ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల జిల్లాల నుంచి, గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. ఈ ఏడాది జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నందున ఈ రూట్‌ను వెళ్లే వాహనాలకు ట్రాఫిక్‌సమస్య ఏర్పడి ఇబ్బందులు జరుగుతాయనే ఉద్దేశంతో ట్రాఫిక్‌ను మళ్లించామన్నారు.

భగవద్గీత పఠనంతో దైవజ్ఞానం

కొలిమిగుండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఠనంతోనే దైవజ్ఞానం లభిస్తుందని త్రైతసిద్ధాంతం, ఇందూ జ్ఞానవేదిక తాడిపత్రి కమిటీ సభ్యుడు బాలయ్య అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి: ఏడీఏ

డోన్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజోతి): వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలని ఏడీఏ సునీత రైతులకు సూచించారు. 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని మండలంలో 9 రోజులు విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా కొచ్చెర్వు గ్రామ సచివాలయంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో రైతులు వేసిన పంటలు పాడి, ఆధారిత వ్యవస్థలపై సుదీర్ఘంగా సమీక్షించారు. కార్యక్రమంలో యాగంటి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రమణయ్య, సుధా కర్, పాలరాజు, ఏఈ బిన్ని రాజు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 11,904 మంది రైతులను రైతన్న మీకోసం' కింద నమోదు చేసినట్లు ఏవో సుమతి తెలిపారు. బుధవారం మండలంలోని మందలూరు గ్రామసభలో ఏవో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు రైతన్న మీకోసం జాబితా సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజు, ఫైమా తబుస్సుం, రమాదేవి పాల్గొన్నారు.

చాగలమర్రి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఏవో రంగనేతాజీ, ఉద్యానశాఖ అధికారి దస్తగిరి అన్నారు. బుధవారం ముత్యాలపాడు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు రబీ, ఖరీఫ్ పంటల సాగులో రైతులకు మెలకువలు, సాగు పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ సునీత

కోవెలకుంట్ల: మండలంలోని చిన్న కొప్పెర్ల గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ఏఓ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రైతన్న నీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్లు కవిత, రమాదేవి, రవి ప్రకాష్‌రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు నీటి లభ్యత వినియోగం, బిందు సేద్యం, డిమాండ్ ఆధారిత పంటలు కొర్ర, రాగులు, సజ్జలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వల్లంపాడు, చిన్నకొప్పెర్ల, పెద్ద కొప్పెర్ల గ్రామాల ప్రజలు, ఏఈఓ రమణ, వీఏఏలు ధరణి, ఆఫ్రిన్ పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలం

సంజామల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త ధనలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె వారి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు చిరు ధాన్యాల ఆవశ్యకతపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత కలిసి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త లక్ష్మీప్రియ, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

శిరివెళ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని బోయలకుంట్ల సహకార సంఘం చైర్మన్ కాటంరెడ్డి అరుణ అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోయలకుంట్ల గ్రామ సహకార సంఘం ఆవరణలో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రానున్న రబీ, ఖరీఫ్‌లో సాగు చేయాల్సిన పంటలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, సీఈవో దస్తగిరి, ఎన్జీరంగా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసం చేస్తే చర్యలు

బేతంచెర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుకాణాల యజమానులు తూకాల్లో మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని డోన్ తూనికల, కొలతల శాఖ సీఐ నాగరాజు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని వ్యాపార దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యవసర వస్తువులపై ఎంఆర్‌పీతోపాటు, ఆల్ టాక్సెస్ ఉండాలని దుకాణాల యజమానులకు సూచించారు. పాత బస్టాండ్‌లో పండ్ల దుకాణంలో ఎలక్ట్రికల్ కాటాను తనిఖీ చేసి తన సిబ్బందితో సీల్ వేయించారు. ఆయన వెంట హనుమంత నాయక్, శ్రీనివాసులు ఉన్నారు.


దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ

వ్యక్తిపై కేసు నమోదు

ఆళ్లగడ్డ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో తప్పుగా ప్రచారం చేసిన వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మీడియా ప్రతినిధి అంటూ బెదిరించిన ఘటనలో ఫిర్యాదు అందడంతో పట్టణ ఎస్‌ఐ నగీనా కేసు నమోదు చేశారు. గత నెల 28న మీడియా ప్రతినిధి(ఎలక్ట్రానిక్) అంటు టి దుకాణం వద్ద సిగరెట్లు ఇవ్వాలని కోరడంతో ఆయన తిరస్కరించడంతో బాధితుడిని చంపుతానని బెదిరించడంతోపాటు సామాజిక మాధ్యమాల్లో పరువుకు భంగం కలిగేలా పోస్టులు పెట్టాడని టి బంకు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల సమీపంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కొలిమిగుండ్లకు చెందిన వెంకటేషు, కనకాద్రిపల్లెకు చెందిన రాజా రెడ్డి మోటార్ సైకిల్‌పై కనకాద్రిపల్లెకు వెళ్తుండగా ఇటిక్యాల వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది చిన్నయ్య తెలిపారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

ప్యాపిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జలదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లు, నాటుసారాను బుధవారం సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ నాగార్జున సమక్షంలో ధ్వంసం చేశారు. 715 లీటర్ల నాటుసారాతోపాటు 4.47లీటర్ల కర్ణాటక, 74.88 లీటర్ల ఆంధ్ర మద్యం బాటిళ్లను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు.

పల్లాను కలిసిన టీడీపీ నాయకులు

ప్యాపిలి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు యాదవ్‌ను బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్యాపిలి మండల కన్వీనర్ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని పార్టీ పరిస్థితులను పల్లా అడిగి తెలుసుకున్నట్లు వారు తెలిపారు. అలాగే విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కూడా కలిసినట్లు తెలిపారు.


పల్లాతో టీడీపీ నాయకులు